క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఏడీఏ

డోన్: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ వెటర్నరీ ఉద్యోగుల ఫెడరేషన్ డైరీని డోన్ ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ నాగరాజు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉద్యోగుల సంఘం తాలుకా ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ, పశు వైద్యులు ఉసేన్‌బాషా, హరీష్, సంఘం నాయకులు రామాంజనేయులు, ఈశ్వర్‌నాయక్, నవ్య, సుజాత, బాషా పాల్గొన్నారు.

30న మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

కొలిమిగుండ్ల: మండలంలోని రైతులందరూ తప్పక ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి జ్యోతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేసి పారదర్శకత పెంచేందుకు దేశ వ్యాప్తంగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ప్రతి రైతు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. వీటి ద్వారా రాబోయే కాలంలో ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు అమలు చేయబోతున్నారని తెలిపారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రెవెన్యూ అధికారులకు లాగిన్‌లు ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఆధార్ కార్డు, వన్‌బీ, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వాస్పత్రికి కుర్చీలు విరాళం

డోన్: వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో రోగులు, సహాయకులు కూర్చోవడానికి అవసరమైన కుర్చీలను తారకరామనగర్‌కు చెందిన అశోక్ గౌడ్, శిరీష దంపతులు సోమవారం విరాళంగా అందజేశారు. తమ కుమారుడు నవీన్‌కుమార్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రూ. 10 వేల విలువ గల కుర్చీలను అందించడంతో పాటు రోగులు, వారి సహాయకులకు రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేశారు. ప్రార్థన సమ యం సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కోవెలకుంట్ల: అర్హులైన దివ్యాంగులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆ సంఘం జేపీసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన బహిరంగ సమావేశంలో దివ్యాంగుల సంక్షేమానికి 32 హామీలు ఇచ్చారన్నారు. ఆ హామీల్లో ఇళ్లస్థలాలు ఒకటని గుర్తు చేశారు. ఇంటి స్థలంతోపాటు డబుల్‌బెడ్‌రూం కట్టించి ఇవ్వాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దివ్యాంగులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ త్వరలో బనగానపల్లె నియోజకవర్గంలోని తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న పొలాల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఊటకొండ గ్రామంలో పలువురు రైతులు సాగు చేసిన మొక్కజొన్న పొలాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్టు రామకృష్ణారావు, కోఆర్డినేటర్లు రమణమ్మ, వెంకటరమణ, సుజాతమ్మ, వ్యవసాయాధికారి రాజేశ్ సోమవారం పరిశీలించారు. మొక్కజొన్న మొక్కలకు ఆకులు చివరి భాగంలో విసనకర్ర ఆకారంలో ఉండి కండెలు గుత్తులుగా ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇలా ఏర్పడటానికి గల కారణాలను తెలుసుకునేందుకు కండెలను సేకరించారు. విత్తనం కారణంగా ఈ సమస్య తలెత్తిందా లేక వైరస్ నుంచి వ్యాపించిందా అనే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. రైతులు ఏటా ఒకే పంటను కాకుండా పంటమార్పిడి చేయడం ద్వారా ఇలాంటి సమస్యలు తలెత్తవని తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

బేతంచెర్ల: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం దాతలు సత్తార్, శంకర్ రెడ్డి సహకారంతో రోటరీ క్లబ్ సభ్యులు రూ.30 వేల విలువ చేసే కంప్యూటర్లను అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పూలమ్మినా పూటగడవడం కష్టం

- అన్‌సీజన్ కావడంతో పడిపోయిన పూల ధరలు
- మందగించిన విక్రయాలు
- నష్టపోతున్న రైతులు, వ్యాపారులు



ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పూల వ్యాపారులు, డోన్ స్టేషన్‌లో రైలు ఆలస్యం కావడంతో పూలు కట్టుకుంటున్న మహిళలు →



డోన్: పూల రైతులు, వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు లేకపోవడంతో పూల ధరలు పడిపోయాయి. కూలీలు, రవాణా చార్జీలు కూడా రావడం లేదని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విక్రయాలు లేకపోవడంతో పూల వ్యాపారులు సైతం నష్టపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు చూసినా కొనేవారు కరువయ్యారు. అమ్మినకాటికి అమ్మి మిగిలినవి పారబోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎగుమతి చేద్దామన్నా డిమాండ్ లేకపోవడంతో తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

నియోజకవర్గంలో 2 వేల మంది వ్యాపారులు

డోన్ నియోజకవర్గంలో సుమారు 2వేల మంది పూల వ్యాపారంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో వీరి జీవనం కష్టతరంగా మారింది. అప్పులు చేసి జీవనం గడపాల్సిన పరిస్థితి తలెత్తిందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లిల్లీ, గులాబీలు దిగుమతి

ఈ ప్రాంతంలో జరిగే వివాహాది శుభకార్యాలతో పాటు ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు బెంగుళూరు నుంచి లిల్లీ, గులాబీ పూలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ లేకపోవడంతో మార్కెట్ మందగించింది. కనకాంబరాలు కిలో రూ.250, కాగడాలు కిలో రూ.300, మల్లెపూలు రూ.500 ఉన్నా లిల్లీ, చామంతి, ముద్ద బంతి పూల ధరలన్నీ కిలో రూ.30 నుంచి రూ.40కే విక్రయించాల్సి వస్తోంది.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

స్థానికంగా పండించే చామంతి, ముద్దబంతి, కనకాంబరాలు, మల్లె, లిల్లిపూలను వందలాది మంది వ్యాపారులు కొనుగోలు చేసి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోని రాయచూర్, బళ్లారి తదితర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. మరికొందరు వ్యాపారులు రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేసి విజయవాడ, తాడిపత్రి, పత్తికొండ, ఎమ్మిగనూరు, గుంటూరు, హైదరాబాదు, మహబూబ్ నగర్, మార్కాపురం, కంభం ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

అప్పుల పాలయ్యాం



ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో పండించిన పూలకు సరైన ధర లభించడం లేదు. స్థానికంగా మద్దతు ధర లేకపోవడంతో పూలను పారబోయలేక వ్యాపారులకు తక్కువ ధరలకే విక్రయించాం. పెట్టుబడి మాట అటుంచితే కరెంట్ బిల్లులు, కూలీ డబ్బులు సైతం గిట్టుబాటు కావడం లేదు.

–బోయ శ్రీరాములు, పూల రైతు, ధర్మవరం

నష్టపోతున్నాం



పూలకు ప్రస్తుతం మార్కెట్ లేకపోవడంతో కొనుగోలు చేసి విక్రయిస్తామనుకున్న పూలన్నీ పారబోయాల్సిన పరిస్థితి. బహిరంగ మార్కెట్‌లో చిరు వ్యాపారం చేస్తున్నందు వల్ల ఎండకు పూల వాడిపోతున్నాయి. మరునాడే కొన్ని పూలు కుళ్లిపోతున్నాయి. దీంతో రెక్కాడితే కానీ డొక్కాడని మాలాంటి చిరు వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నాం.

–లలిత, పూల వ్యాపారి, డోన్

గిట్టుబాటు కావడం లేదు



నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 2వేల మంది గంప నెత్తిన పెట్టుకుని పూల వ్యాపారం చేసేవారు ఉన్నారు. ఇక్కడి ప్రాంతాలతో పాటు పక్కనున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు రాత్రిళ్లు రైళ్లలో ప్రయాణించి విక్రయాలు చేస్తుంటారు. ప్రస్తుతం సరైన విక్రయాలు జరగక నిరాశ చెందాల్సి వస్తోంది. రేయింబవళ్లు కష్టించినా పూట గడవడం గగనమైంది.

–అరుణజ్యోతి, వ్యాపారి, చిగురుమానుపేట

ప్రభుత్వం ఆదుకోవాలి



గత ప్రభుత్వం మహిళల కోసం అమ్మ ఒడి, 45 ఏళ్లు పైబడిన మహిళలకు రూ.18వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తుండేది. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు లభించకపోవడం వల్ల బతుకుతెరువు కష్టంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం మాలాంటి వారి కష్టాలను గుర్తించి ఇచ్చిన హామీలను అమలు చేస్తే ఆర్థికంగా ఉపశమనం లభిస్తుంది. –అల్లింటి, పూలవ్యాపారి, కొండపేట, డోన్

మద్యం దుకాణాలకు దరఖాస్తులు

డోన్ రూరల్: ఈడిగ(కల్లుగీత) కులస్తులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. డోన్ మున్సిపాలిటీ పరిధిలో-1, రూరల్‌లో-1 మద్యం దుకాణం కేటాయించినట్లు చెప్పారు. అర్హులైన వారు ఫిబ్రవరి 5వ తేదీలోగా రూ.2 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం డోన్ ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేతంచెర్ల: పట్టణంలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య తెలిపారు. బేతంచెర్లలోని సిద్ధప్ప గుడి, డ్రైవర్స్ కాలనీ, గొరిపేట పూదోట మఠం, బైటిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పెండేకల్లు పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, మద్రికుంట గ్రామానికి చెందిన దారం వెంకటరెడ్డి(75) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, బుగ్గన కుమార్ రెడ్డి, మురళీ, ఎద్దులన్న, నాగిరెడ్డి, సుధాకర్ రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సెమినార్ హాల్ నిర్మాణానికి రూ. లక్ష విరాళం



దాత సదాశివారెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ హాల్ నిర్మాణానికి పట్టణానికి చెందిన తేగులపల్లి సదాశివారెడ్డి సోమవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాతను ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సదాశివారెడ్డి అమెరికాలో స్థిరపడినప్పటికీ ఈ ప్రాంతంపై ఉన్న అభిమానం, సేవా దృక్పథం అభినందించదగ్గ విషయమన్నారు. రానున్న రోజుల్లో కళాశాలలో ప్రాజెక్టర్ నిర్మాణానికి విరాళం ఇస్తానని దాత ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పప్పుశనగలో పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ పైరులో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం కోవెలకుంట్ల మండలం రేవనూరులో చేపట్టిన పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. పంటకోత ప్రయోగంలో ఎకరాకు 5.3 క్వింటాళ్లు వచ్చేలా రికార్డు అయిందని పేర్కొన్నారు. ఈ ఏడాది రబీసీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పంట ఆధారంగానే నష్ట పరిహారం, ఇన్సురెన్స్, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, వ్యవసాయ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కంది సాగు చేసిన రైతులు దిగుబడులు విక్రయించేందుకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. క్వింటా రూ. 7,500 మద్దతు ధరతో కందులను విక్రయిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్, ఏఓ నిరంజన్ పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి



పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కోవెలకుంట్ల: ప్రభుత్వం పెన్షనర్ల బకాయిలు చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పిల్లారిశెట్టి రంగారావు పెన్షనర్ల భవనంలో సోమవారం పెన్షనర్ల వార్షిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్ల డీఆర్, అరియర్స్ లెక్కించి ఐదు విడతలుగా రావాల్సిన మొత్తాన్ని అందజేయాలన్నారు. అనంతరం 75 ఏళ్లు నిండిన ప్రభుత్వ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సంఘం నాయకులు జీవీ సుబ్బారెడ్డి, ఈశ్వరెడ్డి, ముత్తోజ్ వీరబ్రహ్మం, రామకృష్ణమూర్తి, నాగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటస్వామి, ఉసేనయ్య, హరి, నారాయణ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కోవెలకుంట్ల: మండల కేంద్రానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన సానియా ఈ నెల 24వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తండ్రి అబ్దుల్ రసూల్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బనగానపల్లెలో వ్యక్తి అదృశ్యం

బనగానపల్లె రూరల్: పట్టణానికి చెందిన కోడి రవికుమార్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కరెంట్ ఆఫీస్ ఏరియాలో నివాసం ఉంటున్న పుల్లయ్య కుమారుడు రవికుమార్ స్థానిక సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మందకృష్ణ పోరాటాల ఫలితమే పద్మశ్రీ

కోవెలకుంట్ల: మందకృష్ణ మాదిగ పోరాటాల ఫలితంగానే పద్మశ్రీ అవార్డు దక్కిందని మండలంలోని భీమునిపాడుకు చెందిన ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బోధనం బాలనాగన్న తెలిపారు. మందకృష్ణ 1994లో మాదిగ దండోరా ఉద్యమాన్ని చేపట్టి ఎస్సీ, ఎస్టీల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఉద్యమ నాయకుడిగా ఆయన సేవలను గుర్తించి కేంద్రం పద్మశ్రీ అవార్డుకు ఎంపికచేయడం శుభపరిణామమన్నారు.

బేతంచెర్లలో ఎమ్మార్పీఎస్ నేతల హర్షం

బేతంచెర్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడంపై బేతంచెర్లలో ఎంఈఎఫ్, ఎంఎస్‌ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఆయా సంఘాల నాయకులు నాగేషు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

వాహన యజమానుల ధర్నా

డోన్ రూరల్: స్థానిక ఆర్టీఓ కార్యాలయం ఎదుట వాహన యజమానులు సోమవారం ధర్నా చేశారు. 44వ జాతీయ రహదారిపై బైటాయించడంతో కొద్ది సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తగా వచ్చిన జీఓ ప్రకారం నంద్యాలకు వెళ్లి వాహనాల ఫిట్‌నెస్ రెన్యూవల్ చేయించుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. డోన్‌లోనే రెన్యూవల్ చేసే విధంగా చూడాలని కోరారు. ఆర్టీఓ క్రాంతికుమార్, ఎస్‌ఐ శరత్‌కుమార్ వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు



డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

డోన్ టౌన్: మండలంలోని కొచ్చెర్వు ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిపై బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శివన్న డీఈఓ జనార్ధన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్కూల్‌కు మద్యం సేవించి వస్తున్నారని.. విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం దాడులు చేసినట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

తాగునీటికి ముందస్తు జాగ్రత్తలు



బోరుకు కొత్త మోటర్ ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్

డోన్ రూరల్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎద్దుపెంట పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని సర్పంచ్ బంగారు జయచంద్ర అన్నారు. సోమవారం గ్రామంలోని తాగునీటి బోరుకు కొత్తమోటర్ ఏర్పాటు చేయించారు. గ్రామస్తులకు తాగునీటికి ఇబ్బందులు కాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

యోగా శిక్షణ ప్రారంభం

బనగానపల్లె: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం యోగా శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు డాక్టర్ వీరమురళీధర్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. సివిల్ సర్జన్ డాక్టర్ సుజాత యోగా ప్రాముఖ్యతను వివరించారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులతో డీఈఓ

డోన్ టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని డీఈఓ జనార్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం డోన్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించి వంట గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ కేశిరాజ్ శ్రీనివాస్, వైస్ ప్రిన్స్‌పాల్ చంద్రకాంత్ యాదవ్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

బనగానపల్లెలో పట్టపగలే చోరీ

- లక్ష నగదు, ఆరు తులాల బంగారం చోరీ



బీరవాలో చల్లాచెదురుగా ఉన్న వస్తువులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని జమ్మిరెడ్డి కాలనీలో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. ఇంట్లోని రూ.లక్ష నగదు, ఆరు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుడు చిన్నప్పురెడ్డి వివరాల మేరకు.. జమ్మిరెడ్డి కాలనీకి చెందిన చిన్నప్పురెడ్డి భార్య వేరే గ్రామానికి వెళ్లింది. చిన్నప్పురెడ్డి సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా బీరవాలోని రూ.లక్ష నగదు, ఆరు తులాలు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కర్నూలు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధరించడం శ్రేయస్కరం



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం అన్ని విధాలా శ్రేయస్కరమని కోవెలకుంట్ల సీఐ హనుమంతు నాయక్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్, గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, ముదిగేడు చౌరస్తా, సంతమార్కెట్, గాంధీసెంటర్, అంకాలమ్మ టర్నింగ్ మీదుగా బైక్ ర్యాలీ సాగింది. హెల్మెట్ లేకుండా బైక్‌లు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుని విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు, రమణయ్య పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి

కోవెలకుంట్ల: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోవెలకుంట్ల పశువైద్యాధికారి కృష్ణకుమార్ సూచించారు. సోమవారం మండలంలోని గుళ్లదూర్తి పశువైద్య శిబిరంలో 374 పశువులు, జీవాలకు వైద్య పరీక్షలు చేశారు. 19 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు, 147 షిప్‌పాక్స్ టీకాలు, 197 పశువులు, దూడలు, జీవాలకు నట్టల నివారణ, నాలుగు గర్భ నిర్ధారణ కేసులు, ఒక ఎద సూది, ఆరు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న ఉపాధ్యాయులు

బేతంచెర్ల: మండలంలోని గూటుపల్లె గ్రామానికి చెందిన పేద విద్యార్థి ఆలీ వైద్యం కోసం సోమవారం హెల్ప్ ఫర్ సొసైటీ సంఘం, ఉపాధ్యాయులు రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. కొద్ది రోజుల క్రితం ఇనుప చువ్వలు గుచ్చుకుని బాలుడికి గాయాలయ్యాయి. ఒక ఆపరేషన్ కాగా రెండో ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం అందించారు. కాగా బాలుడి తండ్రి ఖాజా ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. తల్లి మున్ని కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలను పోషిస్తోంది. ఉపాధ్యాయులు తిమ్మయ్య, నాగరాజు, హిదయతుల్లా, నాగ మల్లేష్, గురు ప్రసాద్, వెంకటేష్, గిరి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



కోవెలకుంట్ల: దేవరాయల విగ్రహానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నేతలు



బనగానపల్లెలో..

కోవెలకుంట్ల: పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆర్చీ వద్దనున్న విగ్రహానికి బలిజ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, గాధంశెట్టి రమణయ్య తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీకృష్ణ దేవరాయల పాలనలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో వందలాది దేవాలయాలు నిర్మించారన్నారు. ఆయన వంశస్తులు కోవెలకుంట్లలో పాండురంగస్వామి దేవాలయాన్ని నిర్మించారని పేర్కొన్నారు. ఎన్నో చెరువులు తవ్వించి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. సంఘం నాయకులు పరంధామయ్య, గిద్దలూరు రమణ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, తిరుపాలయ్య పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ జయంతి వేడుకలు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి బలిజ సేవా సంఘం నాయకులు ఘన నివాళులర్పించారు. అలాగే స్థానిక వంద పడకల ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. సంఘం నాయకులు వెంకటయ్య, రవి, నాగార్జునరెడ్డి, నీలి శ్రీనివాసులు, సూరరామసుబ్బయ్య, రామసుబ్బారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.